

రేపు జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యుడు రాక

శ్రీకాకుళం : షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ ఈనెల 14 తేదీన జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయనతో పాటు భారత ప్రభుత్వ కార్యదర్శి పి.కళ్యాణ్ రెడ్డి, ఎన్‌సిఎస్‌టి డైరెక్టర్ ఆర్.ఎస్ మిశ్రా, రీసెర్చ్ అధికారి ఆకాష్ త్రిపాఠి, సీనియర్ ఇన్వెస్టిగేటర్ అశోక్ కుమార్ లక్కర్స్ పర్యటిస్తారని తెలిపారు. 14న ఉదయం మెళియాపుట్టి మండలం కేరసింగిగూడ గిరిజన గ్రామానికి చేరుకుని గ్రామస్తులతో సమావేశమవుతారని పేర్కొన్నారు. అనంతరం జలుమూరు మండలం మాకి గిరిజన గ్రామంలో అక్కడ గిరిజనులతో సమావేశమై, వారి వినతులను స్వీకరిస్తారని తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం రెండు గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్, ఎస్‌పితో కలిసి జిల్లా అధికారులతో జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

పోరాట యోధుడు ఏచూరి



- 2011లో పైడిభీమవరంలో పర్యటన
- ఆయన రాకతోనే 'రెడ్డీస్' పోరాటం విజయవంతం

కమ్యూనిస్టు ఉద్యమ నేత, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, ప్రజా పోరాట యోధుడు సీతారాం ఏచూరి మరణంతో సిపిఎం శ్రేణులు శోకసంద్రంలో మునిగిపోయాయి. గతనెల 19 నుంచి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆయన గురువారం మధ్యాహ్నం మరణించారన్న వార్త తెలుసుకున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు, వామపక్ష నాయకులు, అభ్యుదయవాదులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని, ఆయన పోరాట స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. ఆయన సిద్ధాంత స్ఫూర్తితో, ఆయన చూపిన ఉద్యమ బాటలో నడుస్తామని ప్రతినబూనారు. పోరాటంలో భాగంగా ఆయన జిల్లాకు వచ్చిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రణస్థలం మండలం పైడిభీమవరంలోని రెడ్డీస్ లేబొరేటరీ కార్మికులకు సంఘీభావం తెలిపేందుకు 2011 నవంబర్ 18న సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి జిల్లా పర్యటనకు వచ్చారు. కార్మికుల వేతన ఒప్పందం విషయంలో యాజమాన్యం మొండిగా వ్యవహరించడంతో కార్మికులు వంద రోజుల పాటు సమ్మె చేశారు. ఆ సందర్భంగా ప్రభుత్వం కార్మికులపై దమనకాండ ప్రదర్శించింది. ఆందోళన చేస్తున్న కార్మికులు, వారికి నేతృత్వం వహిస్తున్న సిఐటియు నాయకులపై పోలీసులు బాష్పవాయువు ప్రయోగించడంతో పాటు లాఠీఛార్జి చేశారు. జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలో కార్మికులు, యజమాన్యానికి మధ్య జరిగిన చర్చల్లో అంగీకరించిన ఒప్పందాలను సైతం యాజమాన్యం ఉల్లంఘించింది. ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేసింది. కార్మికుల పోరాటానికి మద్దతుగా సీతారాం ఏచూరి పైడిభీమవరంలోని కార్మికుల దీక్షా శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపారు. ప్రస్తుతం సిపిఎం జిల్లా కార్యదర్శి, నాటి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోవిందరావు, పి.తేజేశ్వరరావు తదితరులు రెడ్డీస్ కార్మికుల సమస్యలపై నాడు ఏచూరికి వినతిపత్రం సమర్పించారు. రెడ్డీస్ కార్మికుల సమస్యలపై పార్లమెంట్‌లో ప్రస్తావించడం ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏచూరి హామీనిచ్చారు. ఆయన రాకతో ఉద్యమం జాతీయస్థాయికి వెళ్లే అవకాశం ఉండడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. దీంతో యాజమాన్యం దిగిరాక తప్పలేదు. వేతన ఒప్పందంతో పాటు ఇతర కార్మికుల సమస్యలనూ పరిష్కరించింది. ఏచూరి మృతి విషయం తెలియడంతో కార్మికులు నాటి పోరాట రోజులను గుర్తు చేసుకుంటున్నారు. ఆ పోరాటంలో ఆయన చేసిన కృషిని మననం చేసుకుంటూ కంటతడి పెట్టుకున్నారు.



ఏచూరికి వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు (ఫైల్)

ఐక్యతను కాపాడే ధోరణి



మతోన్మాద శక్తులతో తీవ్రమైన సైద్ధాంతిక సంఘర్షణ పడుతున్న నేపథ్యంలో సీతారాం ఏచూరి మరణించడం దేశంలో మతోన్మాద వ్యతిరేకశక్తులకు తీవ్రమైన లోటు. ఆయన ఎదుటి వారు చెప్పిన మాటలో శ్రద్ధగా విని లోతుగా అవగాహన చేసుకొని సూటిగా స్పష్టంగా సమధానం చెప్పగలిగే సమర్థులు. ఏ విషయం చెప్పినా మృదువుగా ఇతరులను బాధపెట్టకుండా ఒప్పించే విధంగా మాట్లాడే స్వభావం పార్టీలో వివాదాలను పరిష్కరించే దిశగా ఉండేది. భావోద్వేగాలకు గురికాకుండా సంక్లిష్ట పరిస్థితుల్లోనూ ఐక్యతను కాపాడే ధోరణి ఏచూరిది.

- భవిరి కృష్ణమూర్తి
సిపిఎం సీనియర్ నాయకులు

ఉద్యమాలకు ఊతం

కొత్తూరు : విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదంతో గతేడాది సాగిన ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో నిర్వహించిన బైక్ యాత్ర ముగింపులో ఏచూరి చేతుల మీదుగా మెమోంటోను అందుకున్నాను. ఆయన మాటలు స్ఫూర్తినివ్వడంతో పాటు ఉద్యమాలకు ఊతమిస్తాయి.

- సిర్ల ప్రసాదరావు
సిపిఎం నాయకులు



రెడ్డీస్ కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సీతారాం ఏచూరి (ఫైల్)



జోహార్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఏచూరి మృతి తీరనిలోటు

శ్రీకాకుళం అర్బన్ : సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి దేశానికి, వామపక్ష ఉద్యమానికి తీరనిలోటు అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అన్నారు. ఏచూరి మరణ వార్త తెలిసిన వెంటనే నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంపై ఉన్న జెండాను అవనతం చేశారు. సంతాపాన్ని ప్రకటించి విప్లవ జోహార్లు అర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటాలతో పాటు రాజ్యసభ సభ్యునిగా రాజ్యసభలో ప్రజా సమస్యలపై గళం విప్పారన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.కృష్ణమూర్తి, కె.మోహనరావు, జి.సింహాచలం, కె.శ్రీనివాసు, పి.తేజేశ్వరరావు, కె.అప్పారావు, ఎం.గోవర్ధనరావు, శ్రీదేవి పాణిగ్రాహి, వి.జి.కె మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పలువురు సంతాపం

పొందూరు : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి దేశానికి తీరనిలోటు అని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో రాజకీయాలను ప్రభావితం చేసిన నాయకుడు అని కొనియాడారు.

శ్రీకాకుళం అర్బన్: ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరనిలోటు అని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఏచూరి తన జీవితాన్ని కమ్యూనిస్టు ఉద్యమాలకు అంకితం చేశారన్నారు. ఆయన మృతిపై సిపిఐ జిల్లా సమితి తరుపున ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

టెక్కలి రూరల్ : ప్రజా పోరాట యోధుడిని కోల్పోయామని సిపిఎం నాయకులు నంబూరి షణ్ముఖరావు, కొల్లి ఎల్లయ్య, హనుమంతు ఈశ్వరరావు, బగాది వాసుదేవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



అడ్డగోలుగా అమ్మకాలు

- తోటవాడ లేఅవుట్‌లో అనధికారికంగా ప్లాట్ల విక్రయాలు
- ఆకర్షణీయ ప్రకటనలతో విస్తృత ప్రచారం
- తక్కువ ధరకే వస్తుందనే ఆశతో కొనుగోలు
- అనుమతులు లేవని తెలిసి లబోదిబోమంటున్న కొనుగోలుదారులు

సుడా అనుమతులు లేకున్నా జిల్లాలో పలుచోట్ల అక్రమ లేఅవుట్లు వెలుస్తున్నాయి. తమకు అన్ని అనుమతులు ఉన్నాయని ప్రజలను నమ్మిస్తున్నాయి. త్వరలోనే సుడా అనుమతులు వస్తాయని చెప్తూ కొనుగోలుదారులకు అంటగడుతున్నారు. సుందరమైన ప్రకృతి అందాలు, అందమైన పార్కులు, ఆరోగ్యకరమైన జిమ్, ఉల్లాసమైన ఆటస్థలం ఉన్నాయంటూ ఆకర్షణీయమైన బ్రోచర్లు వేసి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. రియల్ వ్యాపారుల ప్రకటనలకు ఆకర్షితులవుతున్న కొనుగోలుదారులు తక్కువ ధరకే వస్తుందని ప్లాట్లను తీసుకుంటున్నారు. తీరా చూస్తే వాటికి అనుమతుల్లేవని తెలిసి లబోదిబోమంటున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, బూర్జ

బూర్జ మండలం తోటవాడ పంచాయతీ పరిధిలో ఓ రియల్ ఎస్టేట్ యాజమాన్యం రెండు వెంచర్లు వేసింది. 2023లో పలు సర్వే నంబర్లతో 17.10 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ వేయగా, 2024లో దానికి ఆనుకుని మరో 15 ఎకరాల్లో లేఅవుట్ ఏర్పాటు చేసింది. రెండుచోట్లా వేసిన లేఅవుట్లు అనధికారికమని శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) తేల్చింది. అయినా రియల్ ఎస్టేట్ యజమాన్యం యథేచ్ఛగా అమ్మకాలు చేయడం పలువురిని విస్మయానికి గురిచేస్తోంది. కొల్లివలసలో ప్రధాన రహదారికి అనుకుని ఒక కార్యాలయం సైతం ప్రారంభించి అమ్మకాలు మొదలుపెట్టింది. స్థానికంగా ఉన్న డిమాండ్, లేఅవుట్‌లో రోడ్డు వెడల్పు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఒక్కో ప్లాటును రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ప్లాట్ల అమ్మకాలకు కమీషన్ పద్ధతిపై ఏజెంట్లను సైతం నియమించి విక్రయాలు సాగిస్తోంది. బూర్జ మండల పరిసర గ్రామాలతో పాటు సమీప మండలాల్లో ఏజెంట్లు తిరిగి వీటిని కొనుగోలుదారులకు అంటగడుతున్నారు. ఈ వెంచర్‌లో సుమారు 540 ప్లాటను వేసినట్లు తెలుస్తోంది. అందులో ఇప్పటికే 200కు పైగా ప్లాట్లను అమ్మేసినట్లు సమాచారం.

అనుమతులపై మాయమాటలు

తమ దగ్గరకు వచ్చిన క్లయింట్లకు రకరకాల మాటలతో మభ్యపెడుతున్నారు. గ్రామాల్లో తిరుగుతున్న ఏజెంట్లు కూడా అవేరకమైన మాటలు చెప్తున్నట్లు తెలుస్తోంది. కొల్లివలసలో 2009లో ప్రసాద్ టౌన్‌షిప్ లేఅవుట్‌లో గజం స్థలాన్ని రూ.400కి విక్రయించామని ఇప్పుడు అదే స్థలం రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు కొనుగోలుదారులు అమ్ముకుంటున్నారంటూ బ్రోచర్లు పంచుతున్నారు. కొల్లివలస కూడలిలో సెంటు భూమి విలువ రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పలుకుతోందని, అదే రోడ్డుకు ఆనుకుని ఉన్న ప్రసాద్ టౌన్‌షిప్ లేఅవుటులో ప్లాట్ కొంటే భవిష్యత్‌లో స్థలం విలువ పెరుగుతుందంటూ మాయమాటలు చెప్తున్నారు. టౌన్‌షిప్‌లో 17 ఎకరాలకు పంచాయతీ అనుమతులు ఉన్నాయని, మిగిలిన 26 ఎకరాలకు సుడా అనుమతులు త్వరలో రానున్నాయంటూ నమ్మబలుకుతున్నారు. మరోవైపు పంచాయతీపరంగా తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని అధికారులు చెప్తున్నారు. తోటవాడలోని లేఅవుట్లు అనధికారికమని సుడా అధికారులు ప్రకటన సైతం విడుదల చేయడం గమనార్హం. ఈ అంశాలేవీ బయటకు పొక్కకుండా జాగ్రత్తపడుతూ సొమ్ము చేసుకుంటోంది.

'నాలా' చెల్లింపులు సక్రమమేనా..?

లేఅవుట్ల కోసం ఎక్కువగా వ్యవసాయ భూములనే రైతుల భూములనే కొనుగోలు చేస్తున్నారు. వ్యవసాయ భూములను వాణిజ్య అవసరాలకు వినియోగించాలంటే వ్యవసాయేతర భూముల మదింపు చట్టం (నాలా) ప్రకారం ఎకరాకు 11 శాతం మేర పన్ను చెల్లించాల్సి ఉంటోంది. తోటవాడలో వేసిన లేఅవుటు యాజమాన్యం ఇందులో ఎంతవరకు సక్రమంగా చెల్లించిందో కూడా సందేహాస్పదంగానే ఉంది. అధికారులకు ఇచ్చిన లెక్కలు, వారికి దగ్గరకు వచ్చిన క్లయింట్లకు చెప్తున్న అంశాలు భిన్నంగా ఉండడం అనేక అనుమానాలకు దారితీస్తోంది. రెండు వెంచర్ల విస్తీర్ణం కలిపి 32.10 ఎకరాలు ఉండగా, కొనుగోలుదారుల వద్ద దాని విస్తీర్ణం 43 ఎకరాలుగా చెప్పడం గమనార్హం.

అనధికార లేఅవుట్లలో ప్లాట్లను కొనొద్దు



పంచాయతీల్లో అనధికారికంగా వేసిన లేఅవుట్లలో ప్లాట్లను కొనొద్దు. అటువంటి ప్లాట్లకు ప్రభుత్వపరంగా ఎటువంటి మౌలిక వసతులు కల్పించడం ఉండదు. అనధికార లేఅవుట్లను తొలగించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిస్తున్నాం. కార్యదర్శులు ఉదాసీనంగా వ్యవహరిస్తే వారిపైనా చర్యలు తప్పవు.

- ఆర్.వెంకట్రామన్,
ఇన్‌ఛార్జి జిల్లా పంచాయతీ అధికారి

వైభవంగా కొత్తమ్మతల్లి ఉత్సవాల నిర్వహణ

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

అక్టోబరు 1 నుంచి మూడో తేదీ వరకు కొత్తమ్మతల్లి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ఉత్సవాల నిర్వహణపై అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి అధికారులు, గ్రామ పెద్దలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లు, బారికేడ్లు, విద్యుత్ అలంకరణలు, కొన్నిచోట్ల బయో టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. కోటబొమ్మాళి పెద్ద చెరువు నుంచి కొత్తపేట జంక్షన్‌కు రోడ్డుకు ఒక లేయర్ నిర్మాణం చేపట్టాలని ఆర్అండ్‌బి అధికారులకు సూచించారు. ఉత్సవాలకు వచ్చే యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. క్యూలైన్‌లో తాగునీరుతో పాటు చిన్నపిల్లలకు పాలు కూడా అందుబాటులో ఉంచాలన్నారు. గత ప్రభుత్వం ఆలయ అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. గాలి గోపురంపై పిడుగు పడడంతో కొంతభాగం దెబ్బతిన్నా, కనీసం మరమ్మతులు చేపట్టలేదన్నారు. ఉత్సవాలకు ముందే ఆ మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కొత్తమ్మతల్లి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చానని, అధికారంలో రాగానే అమలు చేశామని చెప్పారు. ఇకపై ఉచిత ప్రసాదం, ఉచిత దర్శనం అమల్లోకి తీసుకురావాలని సూచించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు మంత్రితో పాటు కలెక్టర్, జెసి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు.

ఎఎన్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



జెసికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఆశా కార్యకర్తను వేధింపులకు గురిచేసి ఆమె ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఎఎన్‌ఎం హేమలతపై చర్యలు తీసుకోవాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, జిల్లా అధ్యక్షులు డి.ధనలక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో డిఎంహెచ్ఒ బి.మీనాక్షిని కలిసి వినతిపత్రాలను అందజేశారు. టెక్కలి మండలం కె.కొత్తూరు పిహెచ్‌సి పరిధిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్త సనపల సరస్వతిని టెక్కలి సచివాలయం-3 ఎఎన్‌ఎం బి.హేమలత వేధింపులకు గురిచేయడం వల్ల ఆత్మహత్యాయత్నం చేసిన ఆశా కార్యకర్త ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య పోరాడుతోందన్నారు. సరస్వతిని వేధింపులకు గురిచేసిన హేమలతతో పాటు ఎంఎల్‌హెచ్‌పి కమలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సరస్వతికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. జిల్లా యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకొని ఆశా కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు.

లోక్ అదాలత్‌తో ఇరుపక్షాలకూ గెలుపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ఈనెల 14వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా వెల్లడించారు. జిల్లా కోర్టు భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసి పనిభారం తగ్గించుకోవాలన్నారు. రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, బ్యాంకు సంబంధించిన కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించి, ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసు రాజీ అయితే ఇరు పక్షాలకూ గెలుపే ఉంటుందని తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేసుకుని కొత్త జీవితం ప్రారంభించడానికి ఇదో మార్గమన్నారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

క్రీడలతో మానసికోల్లాసం

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ప్రజాశక్తి- పోలాకి

విద్యార్థులకు క్రీడలతో మానసిక ఉల్లాసంతో కలుగుతుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని మబగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల లెవెల్ స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యాన గ్రిగ్ మీట్ ఆటల పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు శారీరక మానసిక వికాసానికి ఎంతో అవసరమని అన్నారు. చదువుతో పాటు క్రీడల్లో శ్రద్ధ వహించాలన్నారు. ఆ దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉన్నతమైన అవకాశాలు లభిస్తాయని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ లింగరాజు, ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణన్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పట్టణంలోని సురంగి రాజా క్రీడా మైదాన ఆవరణలో గురువారం జోన్-1 వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు కె.వద్యనాథరెడ్డి ఆధ్వర్యాన మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 220 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఐగా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- మెళియాపుట్టి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ రమేష్‌బాబు

మెళియాపుట్టి ఎస్ఐగా పిన్నింటి రమేష్‌బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ బి.రాజేష్ శ్రీకాకుళం విఆర్‌కి బదిలీ అయ్యారు. శ్రీకాకుళం విఆర్‌లో ఉన్న రమేష్‌బాబు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎఎస్ఐ నర్సింగరావు, సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

బదిలీ ఎస్ఐకి సన్మానం

బదిలీ అయిన ఎస్ఐ బి.రాజేష్‌ను బిజెపి ఇన్‌ఛార్జి డాక్టర్ సలాన శరత్ కుమార్ దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగరీత్యా నిబద్ధతతో పనిచేశారని అన్నారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహించి ప్రత్యేక శ్రద్ధ వహించారని అన్నారు. కార్యక్రమంలో ఎస్.రామచంద్రరావు, ఎస్.శ్రవణ్‌కుమార్, ఎస్.వెంకటరావు, వి.రమేష్, మజ్జి పోలినాయుడు, భూపతిరావు పాల్గొన్నారు.

ఆమె కళ్లు సజీవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



తవిటమ్మ (ఫైల్)

నగరంలోని న్యూకాలనీ, డైమండ్ పార్క్, సాయి పార్థివ్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న కిల్లాశెట్టి తవిటమ్మ (74) గురువారం మృతి చెందారు. ఆమె గతంలో తన మరణానంతరం నేత్రాలను దానమిచ్చేందుకు అంగీకారం తెలిపారు. ఆమె గురువారం అకస్మాత్తుగా మృతి చెందడంతో ఆమె కుమారులు, ఎస్ఎస్ జ్యువలరీ అధినేతలు సత్యనారాయణ, శ్రీనివాస్, సురేష్‌లు ముందుకొచ్చి రెడ్‌క్రాస్ ఐబ్యాంకుకు సమాచారం అందించారు. నేత్ర సేకరణ కేంద్రం ఎ టెక్నీషియన్ పి.సుజాత, బ్లడ్ బ్యాంక్ పిఆర్ఒ ఎన్.ఉమాశంకర్ అక్కడకు చేరుకుని కార్నియాలు సేకరించారు. విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి పంపించినట్లు తెలిపారు. జగన్మోహనరావు, బి.మల్లేశ్వరరావు, దుర్గా శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.

పెట్టుబడి సాయం అందించాలి



పొందూరు : వినతిపత్రం అందజేస్తున్న నాయకులు చంద్రరావు

ప్రజాశక్తి- పొందూరు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సిఎం చంద్రబాబు నాయుడు అన్నదాత పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పొందూరు చంద్రారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలం తండ్యాం సచివాలయంలో రైతాంగ సమస్యలు పరిష్కరించాలంటూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం వెంటనే అందజేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని కోరారు. చిన్న, సన్నకారు, కౌలు రైతులు ఎదుర్కొనే సమస్యలు పరిష్కరించాలని, పంటలకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మడ్డువలస కాలువలను త్వరితగతిన పూర్తిచేయాలని, నారాయణపురం కాలువల్లో పూడికలు తొలగించి సాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. మండలానికి పూర్తిస్థాయిలో సాగునీటి సౌకర్యం కల్పించి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. తండ్యాం ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తోనంగి నందోడు, రైతులు పోతిరెడ్డి అప్పారావు, ముగడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తామన్న రూ.20 వేలు హామీని తక్షణమే అమలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ నాయకులు బగాది వాసుదేవరావు, బొడ్డేపల్లి మల్లయ్య డిమాండ్ చేశారు. మండలంలోని లింగాలవలస గ్రామ సచివాలయంలో సిబ్బందిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లోని వ్యవసాయ నీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి సత్వరమే పూర్తి చేయాలన్నారు. లింగాలవలసలోని కాత్రగడలో రిజర్వాయరు నిర్మించాలన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టవద్దని డిమాండ్ చేశారు. భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, బ్యాంకు రుణాలు, రైతు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంపతరావు ఉమాపతి, సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు పాల్గొన్నారు.



టెక్కలి రూరల్ : వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



సోంపేట : వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సోంపేట : రైతులు, కౌలు రైతుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ మామిడిపల్లికి చెందిన రైతులు సచివాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన కర్రి సింహాచలం, టి.రామారావు, పాతిన రామారావు, ఎం.రామారావు, ఎస్.గోపాలు, ఆర్.గురుమూర్తి, కె.లచ్చయ్య తదితరులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

పాలనను గాడిలో పెడుతున్నాం

ఎమ్మెల్యే అశోక్



ఎమ్మెల్యే అశోక్‌ను సన్మానిస్తున్న ఎండిఆర్ యూత్

ప్రజాశక్తి- కవిటి

గత ఐదేళ్లుగా రాష్ట్రంలో పాలన దారి తప్పిందని, ప్రస్తుతం దాన్ని సిఎం చంద్రబాబు సరిదిద్దుతున్నారని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని మడియారపుట్టుగలో ఎండిఆర్ యూత్ ఆధ్వర్యాన గురువారం ఎమ్మెల్యేకు దుశ్శాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విడిపోయిన రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు 2014 నుంచి 2019 వరకు ముఖ్యమంత్రి ఆహరం శ్రమించారని అన్నారు. కానీ, గత ఐదేళ్ల రాష్ట్రం తిరోగమనంలో పయనించిందని ఆరోపించారు. ప్రస్తుతం దాన్ని సరిదిద్దే పనిలో టిడిపి కూటమి ప్రభుత్వం ఉందని అన్నారు. అలాగే మారుమూల ప్రాంతమైన ఇచ్ఛాపురం నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిస్తాయిలో కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మణి చంద్ర ప్రకాష్, బెందాళం రమేష్, మాదిన రామారావు, సంతోష్ పట్నాయక్, బాసుదేవ్ రౌలో, కాశీప్రసాద్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి అభినందనలు

నౌపడ : ఆసియా పసిఫిక్ మినిస్ట్రియల్ కాన్ఫరెన్స్ చైర్మన్ నియమితులైన కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు మత్స్యకార నాయకులు ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. చిన్న వయసులో అత్యున్నత పదవులు చేపట్టారన్నారు. ఢిల్లీలో జరుగుతున్న రెండో ఆసియా పసిఫిక్ మినిస్ట్రియల్ కాన్ఫరెన్స్‌లో 40 దేశాల సభ్యులు ఆయన ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో ఆనందంగా ఉందన్నారు. ఒక ప్రకటన విడుదల చేసిన వారిలో మత్స్యకార నాయకులు, మరువాడ సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి, జిల్లా తెలుగు యువత కార్యదర్శి సూరాడ దాసురాజు, మాజీ వైస్ ఎంపిపి సూరాడ భీమారావు, జిల్లా మత్స్యకార సంఘ నాయకులు సూరాడ ధనరాజు, టిడిపి నాయకులు పుక్కళ్ల శ్రీను, వారాది చంటి, దమ్ము రాణాప్రతాప్, సూరాడ రాయుడు, శ్రీరంగం రాజులు, అడ్ల దానేషు దంగ నర్సింహులు పాల్గొన్నారు.

ఈ రోడ్డు నిర్మాణం ఎప్పుడు?

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం - ఆమదాలవలస పట్టణాలను కలుపుతూ ఉన్న శ్రీకాకుళం - బత్తిలి రోడ్డు నేడు అధ్వాన్నంగా మారింది. గడచిన ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వ హయాంలో రోడ్డు పనులు మొదలు పెట్టారు. రెండు లైన్ల రోడ్డుగా విస్తరణ మొదలైంది. సకాలంలో నిధుల విడుదలలో జాప్యంతో పనులు నత్తనడకన సాగాయి. దీంతో రోడ్డు అధ్వాన స్థితికి చేరింది. అంతలోనే ఎన్నికలు రావడంతో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ రోడ్డును పూర్తి చేస్తామని టిడిపి, బిజెపి, జనసేన నాయకులు ఊదరగొట్టారు. ప్రజలు మూడు పార్టీల కూటమి ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టారు. ఎన్నికలు అయిన తర్వాత మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అచ్చెన్నాయుడు 15 రోజుల్లో ఈరోడ్డు పూర్తి చేస్తామని చెప్పడమే కాకుండా అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ సైతం ఎంతో ఆర్భాటంగా స్థానికులతో సమావేశాలు నిర్వహించి 15 రోజుల్లోనే రోడ్డు పూర్తవుతుందని, ప్రజలు సహకరించాలని, రోడ్డు విస్తరణలో నష్టపోతున్న బాధితులకు పరిహారం సైతం లెక్కలు కట్టారు. అయితే పనులు నేటికీ పట్టాలు ఎక్కలేదు. పనులు చేపట్టాల్సిన కాంట్రాక్టర్ బిల్లుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండడంతో చిన్నపాటి వర్షాలకు సైతం రోడ్డుపై ఉన్న గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తోంది. ప్రధానంగా కొత్తరోడ్డు - వాకలవలస మధ్య రోడ్డు మరింత అధ్వాన స్థితికి చేరింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే రోడ్డు పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



గోతులమయమైన శ్రీకాకుళం - ఆమదాలవలస రోడ్డు



పొలంలోకి దూసుకెళ్లిన బస్సు

పొలంలోకి దూసుకెళ్లిన బస్సు

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- సోంపేట

శ్రీకాకుళం నుంచి సోంపేట వస్తున్న ఆర్‌టిసి బస్సుకు పెద్ద ప్రమాదం తప్పింది. డ్రైవర్ చాకచక్యంతో వ్యవహరించడంతో బస్సుతో పాటు అందులో ప్రయాణిస్తున్న 30 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వివరాల్లోకి వెళ్తే... శ్రీకాకుళం నుంచి సోంపేట 30 మంది ప్రయాణికులతో ఆర్‌టిసి ఎక్స్‌ప్రెస్ బస్సు వస్తుంది. మండలంలోని రాణిగాం-మామిడిపల్లి గ్రామాల మధ్య పాత జాతీయ రహదారి వద్దకు వచ్చేసరికి బస్సు స్టీరింగ్ మరమ్మతులకు గురైంది. డ్రైవర్ బి.టి.నాయుడు అప్రమత్తమై ప్రయాణికులకు హెచ్చరించారు. దీంతో ప్రయాణికులంతా ఒకసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. అనంతరం డ్రైవర్ చాకచక్యంగా బస్సు వేగాన్ని నియంత్రించారు. ఆ తరువాత బస్సును రహదారి సమీపంలోని పొలాల్లోకి మెల్లగా మళ్లించి బ్రేక్ వేశాడు. దీంతో పొలం అంచున ఉండిపోవడంతో ప్రమాదం తప్పింది. బస్సు బోల్తా పడినా, ఎదురుగా వెళ్తున్న వాహనాలను ఢీకొన్నా పెద్ద ప్రమాదమే జరిగేదని ప్రయాణికులు భయంతో వివరించారు. చాకచక్యంగా వ్యవహరించి తమందరి ప్రాణాలను కాపాడిన డ్రైవర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాదం సంభవించకుండా సమయ స్ఫూర్తిగా వ్యవహరించిన డ్రైవర్‌ను స్థానికులు అభినందించారు.

బియ్యం పట్టివేత



బియ్యాన్ని సీజ్ చేసిన అధికారులు

ఇచ్ఛాపురం : పిడిఎస్ బియ్యం ఇకపై ఎవరు కొన్నా, అమ్మినా దాడులు చేపట్టి కేసు నమోదు చేస్తామని తహశీల్దార్ వెంకటరావు హెచ్చరించారు. గురువారం వేకువజామున రైల్వే స్టేషన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియాన్ని సీజ్ చేశామన్నారు. లబ్ధిదారులు తినకుండా వ్యాపారస్తులకు అధిక ధరకు అమ్ముతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. అలాంటి కార్డుదారులను గుర్తించి వారి కార్డులు రద్దు చేయడానికి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని తెలిపారు. నగరంలో ఏ వ్యాపారస్తులు పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వలు ఉంచితే సీజ్ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం పేదలకు అందించే బియ్యం పక్కదారి పట్టకుండా తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ దాడుల్లో డిటి సంతోష్, విఆర్ఒ కృష్ణ పాల్గొన్నారు.

117 జిఒ రద్దుపై పోరాటం

పొందూరు: రాష్ట్ర ప్రభుత్వం 117 జిఒను రద్దు చేసేంతవరకు పోరాటం చేస్తామని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కౌన్సిల్ సభ్యులు గండెం రామారావు అన్నారు. మండలంలోని తాడివలస, గోరింట, తుంగపేట పాఠశాలల్లో బుధవారం డిటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు అవుతున్నా 117 జిఒ రద్దు విషయంలో తాత్సారం చేస్తుందన్నారు. ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, డిఎలు, కొత్త పిఆర్‌సి ఏర్పాటు, ఐఆర్ ప్రకటన, సిపిఎస్ విధానం రద్దు వంటి అనేక సమస్యలపై ఏమీ పట్టనట్లు వ్యవహరించడం తగదన్నారు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిటిఎఫ్ బాధ్యులు వేణుగోపాల్, భాస్కర్ పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న సంజీవరావు

రైతు ఉత్పత్తిదారులకు శిక్షణ

కొత్తూరు : స్థానిక వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యాన అడవి తల్లి రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులకు బిజినెస్ డెవలప్‌మెంట్ ప్రణాళికపై గురువారం శిక్షణ ఇచ్చారు. వెలుగు అసోసియేషన్ కార్యదర్శి బి.సంజీవరావు సహకార సంఘ సూత్రాలు, సభ్యుల బాధ్యతలు, సంఘానికి ఉండవలసిన సూత్రాలు వివరించారు. మార్షియస్, పైనాపిల్ రకం మొక్కలు నాటే విధానం, ప్రయోజనాలు, రైతుకు కలిగే లాభాలు గురించి ఉద్యానవన అధికారి పిహెచ్ఒ గణేష్, కె.బి.ఎస్.దివాకర్ రిసోర్స్‌పర్సన్ కె.దాసునాయుడు, బి.వెన్నెల, ఎ.చిరంజీవి పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ, మండల పరిధిలో ముమ్మరంగా పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. మున్సిపాలిటీలోని ఫకీరుపేట, మెదర్ వీధి, పెద్దదేవరవీధి అంగన్వాడీ కేంద్రాల్లోని వైస్ చైర్‌పర్సన్ భారతీ దివ్య, మాజీ కౌన్సిలర్ నాగరాజుపాత్రోలు గర్భిణులకు, బాలింతలకు గురువారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి నాగారాణి, సూపర్‌వైజర్లు పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అనంతరం కెజిబివిలో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు వల్ల కలిగే అనార్థాలపై అవగాహన కల్పించి మానవహారం చేపట్టారు. ఎక్కడ గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో కెజిబివి ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ శిరీష, అంగన్వాడీ సూపర్‌వైజర్ సుజాత పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

బూర్జ : బూర్జకు చెందిన కన్యాపు లక్ష్మి (53) పాము కాటుతో మృతి చెందింది. లక్ష్మి గురువారం ఉదయం పొలం చూడటానికి వెళ్లింది. అక్కడ పాము కాటు వేయడంతో సొమ్మసిల్లి పడిపోయింది. సాయంత్రం 6 గంటల వరకు ఆమె ఇంటికి రాలేదు. దీంతో కంగారు పడిన భర్త, ఆమె కుమార్తె, బంధువులు పొలానికి వెళ్లారు. ఆ ప్రాంతమంతా గాలించారు. చివరికి ఓ పొలంలో లక్ష్మి వెల్లకిలబడి కనిపించింది. వెంటనే జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి పాము కాటుతో మృతి చెందిందని ధ్రువీకరించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

వాడివేడిగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి చిరంజీవి


ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఎంపిపి ఎం.చిరంజీవి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సీజన్‌లో నారాయణ పురం ఆయకట్టు శివారు గ్రామాలకు సాగునీటి సరఫరా, విద్యుత్ లైన్లు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు, గ్రామాల్లో విజృంభిస్తున్న విషజ్వరాలు, పారిశుధ్య పనుల నిర్వహణ, ఇటీవల భారీ వర్షాలకు పంట నష్టం అంచనా, ఈ క్రాపింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. పలు పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపిటిసిలు గ్రామ సమస్యలపై అధికారులను నిలదీశారు. మండలంలో పలు గ్రామాల్లో కాలువలు, సిసిరోడ్లు, తాగునీరు, శానిటేషన్ పనులకు సంబంధించి తక్షణమే బిల్లులు మంజూరు చేయాలని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పైడి భాస్కరరావు కోరారు. స్థానిక ఎమ్మెల్యే ఈశ్వరరావు సమావేశానికి హాజరవుతారని ఊహాగానాలతో గతంలో లావేరు, రణస్థలం మండలాల సర్వసభ్య సమావేశాల పరిణామాలను దృష్టిలో పెట్టుకుని సిఐలు అవతారం, చిరంజీవి, పోలీస్ సిబ్బంది, ఎస్‌టిఎఫ్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమాదేవి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బొడ్డపాడు రైతుల నిరసన

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 67లో 150 ఎకరాలు గత ప్రభుత్వం టౌన్ షిప్ ఏర్పాటుకు స్థలాన్ని సేకరించిందని, అందులో అక్రమాలు చోటు చేసుకున్నాయని రైతులు వాపోయారు. ఈ మేరకు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పోతనపల్లి ఈశ్వరమ్మ 1.50 ఎకరాలు, పోతనపల్లి తులసమ్మకు 0.50 సెంట్లు తదితర రైతులతో పాటు మరి కొంత మంది నుంచి టౌన్ షిప్ కోసం భూములు తీసుకున్నారని అన్నారు. ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించలేదన్నారు. భూములు ఇచ్చిన రైతులకు టౌన్ షిప్‌లో ఇళ్ల స్థలాలు ఇస్తామని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు హామీని ఇప్పటి వరకు అమలు చేయలేదని అన్నారు. రైతుల భూములకు ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారంలో పది శాతం రైతులు నుంచి సుమారు రూ.1.50 కోట్లు వసూలు చేశారని అన్నారు. తక్షణమే తిరిగి రైతులకు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై విచారణ జరిపి రైతుల న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డిఒ భరత్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మామిడి కమలమ్మ, బొడ్డు పాపారావు, బొడ్డు దమయంతి, బొడ్డు గౌరమ్మ, పోతనపల్లి ఈశ్వరమ్మ, తులసమ్మ, దుష్యంతు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతులు



శ్రీకాకుళం అర్బన్ : భోజనాన్ని వడ్డిస్తున్న హారికాప్రసాద్

పలుచోట్ల అన్నదానం

ప్రజాశక్తి- బూర్జ

మండల కేంద్రమైన బూర్జలో అంబేద్కర్ యూత్, ఎన్ఆర్ఐ వేపారి వెంకటేష్ ఆధ్వర్యంలో 3 వేల మందికి మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే పాలవలస, డొంకలపర్త, రామన్నపేట, కొండపేట తదితర గ్రామాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వినాయక నవరాత్రుల సందర్భంగా గ్రామాల్లో ఈ అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ యువకులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిటిసి చక్కెర పోలినాయుడు, దారగిరి చంటి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: వినాయక నవరాత్రులను పురస్కరించుకుని నగరంలోని ఇల్లీసుపురం రైతు బజారు వద్ద హారిక కన్‌స్ట్రక్షన్ ఎండి హారికా ప్రసాద్ ఆధ్వర్యాన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లయిన్స్ క్లబ్ హర్షవల్లి సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆయన సతీసమేతంగా హాజరై అన్న సంతర్పణ చేపట్టారు. కార్యక్రమంలో లయిన్స్ క్లబ్ అధ్యక్షులు జగన్నాథం నాయుడు, జోన్ చైర్మన్ కరణం శోభారాణి, ఇల్లీసుపురం యూత్ అప్పి, వాసు, కనకల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



బూర్జ : అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

రూ.12.50 కోట్లు టోకరా!

- లబోదిబోమంటున్న బాధితులు
- బోర్డు తిప్పేసిన 'ప్రేరణ'

ప్రజాశక్తి- పలాస

అధిక వడ్డీ చెల్లిస్తామని చెప్పి ఒక ప్రయివేటు సంస్థ రూ.12.50 కోట్లు వసూళ్లకు పాల్పడ్డారు. మొదట సారి వడ్డీ చెల్లించి బాధితులకు నమ్మబలికారు. చివరకు పదుల సంఖ్యలో బాధితులు నుంచి కోట్లు వసూలు చేసి అక్కడ నుంచి పరారయ్యారు. చివరకు ఇటీవల పలాసకు వచ్చిన సంస్థ ఏజెంట్లను పట్టుకొని గట్టిగా నిలదీయడంతో రూ.2.50 కోట్లు భూముల రూపంలో ఇస్తామని ఒప్పందం కుదుర్చుకోవడంతో స్థానికంగా సంచలనం సృష్టించింది. విశ్వశనీయ సమాచారం మేరకు ముంబాయి, ఢిల్లీ ప్రాంతాల్లో ఉన్న ప్రేరణ సంస్థ ఏడాదిగా పలాస-కాశీబుగ్గలో కార్యకలాపాలు సాగించింది. కాశీబుగ్గ జిఎంఇ కాలనీలో చందాదారులుగా చేర్పించింది. వారి నుంచి రూ.లక్ష నుంచి రూ.50 లక్షల వరకూ తమ సంస్థలో పెట్టుబడులు పెట్టించి వారి నుంచి రూ.12.50 కోట్ల వరకూ వసూళ్లకు పాల్పడింది. సాధారణంగా బ్యాంకర్లు గాని, ఇతర ప్రయివేటు ఫైనాన్స్ సంస్థల గాని తమ సంస్థల్లో పెట్టుబడులు పెడితే 0.87 శాతం నుంచి ఒక శాతం మాత్రమే వడ్డీలు చెల్లిస్తారు. కానీ, ఈ సంస్థ మాత్రం ఏకంగా 18 శాతం వడ్డీలు ఆశ చూపించడంతో రూ.కోట్లు పెట్టుబడులు పెట్టారు. మూడు నెలల క్రితం ఆ సంస్థ అడ్రస్ లేకుండా పోవడంతో స్థానికంగా ఉన్న ఏజెంట్లకు డబ్బులు జమ చేసిన వారంతా పట్టుకున్నారు. దీనిపై వారు సంస్థ నిర్వాహకులతో చర్చలు ప్రారంభించారు. కొంత మొత్తాన్ని ఏజెంట్లు తమ సొంత పూచికతులపై డబ్బులు చెల్లించగా, మిగిలిన వారికి అది కూడా అందలేదు. దీంతో సర్వత్రా ఆందోళన వ్యక్తం కావడంతో పాటు ఈ వ్యవహారం పోలీసుల దృష్టికి తీసుకెళ్తామని కొంతమంది ఖాతాదారులు చెప్పారు. వారు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకొని నిర్వాహకులను నిలదీశారు. ఒకరు నిమ్మాడ ప్రాంతం కాగా, మరొకరు పలాస ప్రాంతానికి చెందిన వారు. వీరు ముంబాయిలో నివాసం ఉంటూ కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో వీరికి స్థిరాస్తి ఉండడంతో వారు దాన్ని చూసేందుకు రెండు రోజుల క్రితం పలాస-కాశీబుగ్గ వచ్చారు. ఈ విషయాన్ని ఖతాదారులు గుర్తించి వారిని పట్టుకున్నారు. అనంతరం వారి ఇద్దరి నుంచి నగదు కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. కొంతమంది రాజకీయ నాయకుల ద్వారా మంతనాలు జరిపారు. చివరకు వారి స్థిరాస్తి రూ.2.50 కోట్ల విలువైనవి ఇచ్చేందుకు అంగీకారం కుదిరింది. రెండు రోజుల నుంచి ఆ కాలనీలో ఇదే హాట్ ట్రాఫిక్‌గా మారింది. మొత్తం వ్యవహారాన్ని కాగితం రూపంలో రాయించుకుని రిజిస్ట్రేషన్లు చేయడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారాన్ని పోలీసుల దృష్టికి తీసుకెవెళ్లకుండా వారే పరిష్కరించుకున్నట్లు స్పష్టమవుతోంది. అయితే రూ.12.50 కోట్లకు రూ.2.50 కోట్ల మాత్రమే ఇవ్వడం ఏమిటనేది ఖాతాదారులు ప్రశ్నిస్తున్నారు. రూ.లక్షలు పెట్టుబడులు పెడితే తమకు వచ్చేది కేవలం రూ.వేలల్లోనే అని ప్రశ్నిస్తున్నారు. దీనిపై కొంతమంది ఖాతాచారులు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, మరికొంత మంది కొంతయినా వచ్చింది కదా? అని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి అనధికార బ్యాంకులపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేయాలని ఖాతాదారులు కోరుతున్నారు.

భూ ఆక్రమణలపై చర్యలు

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి - పలాస



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

పలాస నియోజకవర్గం పరిధిలోని భూ ఆక్రమణలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో లెక్కలేనన్ని భూ అక్రమణలు, దందాలు జరిగాయని వాటన్నింటి వివరాలను సేకరిస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన తర్వాత దీనిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే సంబంధిత ఆధారాలను సేకరించామని, వాటి వివరాలతో సహా రెవెన్యూ అధికారుల ముందుంచుతామన్నారు. పలాసలో గత ప్రభుత్వంలో జర్నలిస్టులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను నిలిపివేస్తున్నామనే ప్రచారంలో వాస్తవాం లేదన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వపరంగా ఆరు నెలల్లో ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ఇచ్ఛాపురం : పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ రమేష్ సూచించారు. పురపాలక సంఘం కార్యాలయంలో వార్డు వెల్ఫేర్ సెక్రటరీలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులను కలిసి వారికి అవగాహన కల్పించి ఇళ్లు కట్టుకోవడానికి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమం హౌసింగ్ ఎఇ ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ రమేష్



నరికిన టేకు దుంగలు

యథేచ్ఛగా టేకు చెట్లు నరికివేత

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని తోటవాడ పంచాయతీ కొల్లివలస గ్రామ సమీపంలో ఉన్న రియల్ ఎస్టేట్‌లో యథేచ్ఛగా టేకు చెట్లను నరికి వేస్తున్నారు. వ్యవసాయ భూములు వ్యవసాయేతర భూములుగా మారిపోతున్నాయి. పంట పొలాల్లోనైనా, ఎక్కడైనా చెట్లను నరికేటప్పుడు ఆ యజమాని రెవెన్యూ, అటవీశాఖ అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఉన్నప్పటికీ స్థానిక రియల్ ఎస్టేట్ భూముల్లో సుమారు వెయ్యి చెట్లుకుపైగా గత నాలుగు రోజులుగా నరికి వేస్తున్నారు. ఇష్టారాజ్యంగా చెట్లు నరికివేస్తున్నా... సంబంధిత అధికారులు పట్టించు కోకపోవడంలో ఉన్న ఆంతర్యం ఏమిటని స్థానికులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. మండలంలో అటవీశాఖ అధికారులు జాడ కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎక్కడ చూసిన అనునిత్యం కలప అక్రమ రవాణా అవుతుందని, అక్రమ కలప వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నప్పటికీ అటవీశాఖ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండి పడుతున్నారు.



టేకు చెట్లను కోస్తున్న వ్యక్తి

అనుమతులు లేవు

కొల్లివలస సమీపంలో ఉన్న రియల్ ఎస్టేట్‌లో చెట్లు నరికేందుకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. భూమి యజమాని తన చెట్లను నరికేందుకు రెవెన్యూ అధికారుల వద్ద నుంచి జిరాయితీ పత్రాన్ని పొందాల్సి ఉంటుంది. ఆ పత్రాన్ని పొందిన తర్వాత అటవీశాఖ అధికారులకు సమర్పిస్తే చెట్ల పరిమాణాన్ని బట్టి తగిన మొత్తాన్ని చలానా తీయాలి. అయితే ఎటువంటి అనుమతులు లేకుండా చెట్లు నరకడం నేరం. ఈ విషయాన్ని స్వయంగా పరిశీలించేం దుకు విఆర్ఒను పంపించడం జరిగింది. తదుపరి యజమానిపై చర్యలు తీసుకుంటాం.

- ఈశ్వరమ్మ, తహశీల్దార్, బూర్జ



వినతిపత్రాన్ని అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

వర్గీకరణను నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

హేతుబద్ధీకరణ లేని ఎస్‌సి వర్గీకరణను తక్షణమే నిలుపుదల చేయాలని జిల్లా ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రపతికి జిల్లా కలెక్టర్ ద్వారా వినతిపత్రాలను పంపాలని కోరుతూ గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షులు బెంజిమన్, రాష్ట్ర మాల ఉద్యోగుల కన్వీనర్ భరత్ భూషణ్ రాజ్, ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పోతల దుర్గారావు, గంజి ఎజ్రా, బోకర నారాయణరావు, అంబోలు ప్రతాప్, డి.జాన్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గిరిజన సమస్యలు పరిష్కరించాలి

మెళియాపుట్టి : రైతు సమస్యలను పరిష్కరించాలని ఆదివాసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వరహాల కృష్ణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ హనుమంతరావును కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలోని అచ్చినాపురం గిరిజనులు ఆఫ్‌షోర్ కెనాల్‌లో తమ భూములు, ఇళ్లు కోల్పోయారని, వారికి పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సవర చొక్కారావు, ఎస్.నాగరాజు, జన్ని మల్లారావు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలు ప్రదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులంతా ఉన్నత స్థానంలో నిలవాలని జూనియర్ ఛాంబర్ అధ్యక్షులు కూన అనిల్‌కుమార్, గ్రీన్‌సిటీ అధ్యక్షులు బెండాలం వరలక్ష్మిలు అన్నారు. గురువారం నగరంలోని బలగ ప్రభుత్వ పాఠశాలలో జెసిఐ వారోత్సవాల్లో భాగంగా పలు పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఏటా సెప్టెంబర్‌లో ఈ వారోత్సవాలను జరుపుకుంటామన్నారు. ఈఏడాది ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను గుర్తించి ప్రతిభా పురస్కారాలను అందించి ప్రోత్సహిస్తున్నామన్నారు. పోటీతత్వం ఉన్నప్పుడే మెరుగైన విద్యను పొందగలరన్నారు. విద్యార్థులు చదువుతో పాటు, క్రీడల్లోనూ, సాంస్కృతిక, సేవా రంగంలో ముందంజ వేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పవన్, తమ్మినేని ఉషారాణి, బొడిగి మధు, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్న జెసిఐ ప్రతినిధులు

వరద బాధితులకు విరాళాల సేకరణ



సరుబుజ్జిలి : విరాళాలు వేస్తున్న చిన్నారులు



కోటబొమ్మాళి : నగదును సేకరిస్తున్న విద్యార్థులు



ఇచ్ఛాపురం : బాక్సులో విరాళాలు వేస్తున్న చిన్నారులు



పాతపట్నం : విరాళాలు సేకరిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం జ్ఞాన భారతి పాఠశాల చిన్నారులు తమవంతు ఆర్థికసహాయాన్ని అందించడానికి ముందుకొచ్చారు. ఈ మేరకు విద్యార్థులు స్వచ్ఛందంగా తమకు తోచిన మొత్తాన్ని వరద బాధితుల సహాయార్థం ఏర్పాటు చేసిన బాక్స్‌లో గురువారం వేశారు. పెద్ద మనసుతో ముందుకొచ్చిన విద్యార్థులను పాఠశాల కార్యదర్శి, సిఇఒ జోహర్‌ఖాన్ అభినందించారు. విద్యార్థుల నుంచి సేకరించిన మొత్తాన్ని వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేస్తామని జోహర్‌ఖాన్ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఇందు భూషణ్ పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు కైలాస్‌కుమార్ పండా, డి.రాము పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: విజయవాడ వరద బాధితులకు కోటబొమ్మాళిలోని బ్లూబెల్స్ (బ్రాంచ్) ప్రయివేటు పాఠశాల విద్యార్థులు విరాళాలను సేకరించారు. పురవీధుల్లో ర్యాలీగా వరద బాధితుల సహాయార్థం నినాదాలు చేస్తూ చేశారు. 2 మేరకు రూ.24 వేలు నగదును సేకరించారు. ఈ సేకరించిన నగదును జిల్లా ప్రయివేటు స్కూల్ యాజమాన్యం (అప్సా) ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని కరస్పాండెంట్ నెయ్యిల చంద్రరావు, ప్రిన్సిపాల్ దమ్మిర దుర్గాప్రసాద్‌లు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాతపట్నం: విజయవాడ వరద బాధితులకు అమర జ్యోతి విద్యార్థులు విరాళాలు సేకరించారని ప్రిన్సిపాల్ సోమేశ్వరరావు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ వెళ్లి విరాళాలు సేకరించారు.

సరుబుజ్జిలి: విజయవాడలో ఇటీవల సంభవించిన వరదతో తీవ్ర నష్టానికి గురైన బాధితుల సహాయార్థం మండలంలోని రొట్టవలసలోని కేరళ ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ స్కూలు కరస్పాండెంట్ బెవర హరినారాయణ ఆధ్వర్యంలో గురువారం పాఠశాల ఆవరణలో సిఎం సహాయనిధికి విరాళాలు సేకరణకు హుండీని ఏర్పాటు చేశారు. పాఠశాల హెచ్‌ఎం బెవర కృష్ణవేణి ఆదేశాల మేరకు పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థుల తల్లి దండ్రులు ముందుగా సిఎం సహాయ నిధికి విరాళాలు అందించారు. పాఠశాలలో ఎల్‌కెజి నుంచి 10 వరకు చదువుతున్న 583 మంది విద్యార్థిని, విద్యార్థులు హుండీలో ఆర్థికసహాయాన్ని వేశారు.

లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని చిట్టివలసలో గర్భస్థ కోశ చికిత్స, లేగ దూడల ప్రదర్శన పశు వైద్యాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్య నిర్వహణాధికారి ఎన్.దామోదర్ మాట్లాడుతూ శ్రీకాకుళం డివిజన్ పరిధిలో 90 శాతం ఖచ్చితత్వంతో ఆడ దూడల పుట్టుకను ఉద్దేశించి లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయు పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ పథకానికి మంచి పశువుల ఎన్నికకు రైతులకు అవగాహనకు గ్రామంలో అన్ని పశువులను పరీక్షించడం జరిగిందన్నారు. రూ.1350 విలువ గల రెండు వీర్య నాళికలు రూ.850 సబ్సిడీపోగా రూ.500 మాత్రమే రైతులు ప్రభుత్వానికి చెల్లిస్తే ఆడపిల్ల దూడలను పొందే వీర్య నాళికలను ప్రభుత్వం సరఫరా చేస్తుందని తెలిపారు. వీర్య నాళికలు ఉపయోగించిన తరువాత కూడా ఆవులు చూడు కట్టకపోతే రైతులు చెల్లించిన రూ.500 తిరిగి రైతులకు అందజేస్తామన్నారు. ఆడదూడకు బదులుగా మగదూడ జన్మిస్తే రూ.250 తిరిగి రైతుకు అందజేస్తామన్నారు. భవిష్యత్‌లోలో ఈ లింగ నిర్ధారిత వీర్యం అత్యధిక ప్రాచుర్యం పొందుతుందన్నారు. ఈ సందర్భంగా 42 పశువులకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు నిర్వహించారు. అలాగే పశువులకు సాధారణ చికిత్సను అందజేశారు. లేగ దూడల ప్రదర్శనలో భాగంగా 28 దూడలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో భాగంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన పాడి రైతులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.ఆనందరావు, అక్కులపేట పశు వైద్యాధికారి డాక్టర్ వై.హేమలత, పశువైద్యులు ఓంకార్, శరత్ చంద్ర, సర్పంచ్ ప్రతినిధి గుజ్జల లక్ష్మణరావు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పశువులను పరీక్షిస్తున్న పశువైద్యాధికారులు

పాలిథిన్ కవర్లు వినియోగిస్తే చర్యలు

ఇచ్ఛాపురం : వ్యాపారులు పాలిథిన్ కవర్లు వినియోగిస్తే చర్యలు తప్పవని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రకుమార్ హెచ్చరించారు. సింగల్ యూస్ ప్లాస్టిక్ పదార్థాల నిషేధంపై మార్కెట్‌లో గురువారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మెయిన్ రోడ్డులోని కిరాణా షాపులు, పాన్‌షాపులు, తోపుడు బళ్లు, ఛాట్, ఫాస్ట్‌ఫుడ్ షాపుల్లో సచివాలయ వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంట్ కార్యదర్శులతో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న మూడు షాపుల యజమాలకు రూ.వెయ్యి విధించి, 8.5 కేజీల ప్లాస్టిక్‌ను సీజ్ చేశామని తెలిపారు.



తనిఖీ చేస్తున్న ఉపేంద్ర కుమార్

ప్లాంటేషన్ పనులు తక్షణమే పూర్తి

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అన్ని మండలాల్లోనూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని తక్షణమే పూర్తి చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు ఆదేశించారు. నగరంలోని డ్వామా కార్యాలయంలో ఎపిఒలు, ఇసిలు, టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బందితో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యక్తిగత పళ్లతోటలు, ఇతర మొక్కల పెంపకం పనులను ప్రాధాన్యతాంశంగా పరిగణించాలన్నారు. పల్లె వనాలు కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలంలోనూ ఔషధ మొక్కలు 20 సెంట్ల కనీస విస్తీర్ణంలో పెంపకం చేపట్టాలన్నారు. ఈనెల 17న జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న వన మహోత్సవ కార్యక్రమంలో పెద్దఎత్తున మొక్కలు నాటాలని ఆదేశించారు. పని కోరిన వారికి ఉపాధిని కల్పించాలని, సగటు పనిదినాల సంఖ్యను పెంచాలన్నారు. సగటు వేతనం మరింత పెరగాల్సిన అవసరముందన్నారు. ప్రతి మండలంలోని కనీసం 20 రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలను చేపట్టాలన్నారు. ఫారం ఫాండ్స్ పనులు నిర్దేశించిన లక్ష్యాల మేరకు చేపట్టకపోవడాన్ని ప్రస్తావించారు. వీటిని వర్షాకాలం పూరయ్యేలోగా చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎపిడిలు శైలజ, మురళీకృష్ణ, నిర్వహణాధికారి కె.వి అప్పలనాయుడు, ఫైనాన్స్ మేనేజర్ స్వరూపరాణి, ఎపిఒలు, ఇసిలు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లుపాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న గిరిజనులు

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మూడవ వార్డు పెంటిపద్ర గిరిజన గ్రామానికి చెందిన సవర ప్రసాద్ ఇటీవల మృతి చెందడంతో ఇద్దరు చిన్నారులతో పాటు భార్య అనాథులయ్యారు. విషయం తెలుసుకున్న దాతలు ముందుకు వస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం గిరిజన కుటుంబాలకు చెందిన దాతలు రూ.25 వేలు సాయంగా అందించారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, భీమారావు, మోహనరావు, రాజగోపాలరావు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బాలకృష్ణయాదవ్

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

పలాస : నియోజకవర్గంలో జరిగిన భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ యాదవ్ కోరారు. ఈ మేరకు ఆర్‌డిఒ భరత్ నాయక్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, కాలువలు, చెరువులు కబ్జాలు చేసి రియల్ ఎస్టేట్లుగా మార్చుకుంటున్నారని అన్నారు. దీనిపై విచారణ చేపట్టి స్థలాలను స్వాధీనం చేసుకోవాలన్నారు.



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ జోగారావు

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

సోంపేట : మండలంలోని పలాసపురం పంచాయతీ సమీపంలోని శ్మశాన వాటికలో పారిశుధ్య పనులను గురువారం స్థానిక సర్పంచ్ తడక జోగారావు ఆధ్వర్యాన చేపట్టారు. ప్రొక్లెయినర్ సహాయంతో శ్మశాన వాటిక వద్ద, రహదారి దగ్గర ఉన్న చెత్తను తొలగించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పంచాయతీ పరిధిలో పనులు చేపడుతున్నట్లు తెలిపారు.



చెక్కును అందజేస్తున్న సత్యారావు

చెక్కు అందజేత

పలాస : విజయవాడ వరద బాధితుల సహాయ నిధికి కాశీబుగ్గ వ్యాపారి ఎరుకోల సత్యారావు రూ.25 వేలు విరాళం ప్రకటించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గౌతు శిరీషను గురువారం కలిసి చెక్కును అందజేశారు. సిఎం సహాయ నిధికి పంపించిలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, కోట్ని దుర్గాప్రసాద్, మల్లా శ్రీనివాస్, పెంట ఉదయశంకర్, పెంట శ్రీను, గాలి కృష్ణారావు, తమ్మినేని గంగారామ్, దేవుడు, సాసుమాన చంద్రమౌళి, జగదీష్ పండా, యాళ్ల రవి పాల్గొన్నారు.

రాయితీపై సోలార్ రూఫ్‌టాప్‌లు

ప్రజాశక్తి- పలాస

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీపై సోలార్ రూఫ్‌టాప్‌లు నిర్మిస్తున్నామని పలాస విద్యుత్ శాఖ ఇఇ పైడి యోగేశ్వరరావు అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్లలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోలార్ రూఫ్‌టాప్ నిర్మాణం చేపట్టడం ద్వారా విద్యుత్ ఆదా అవుతుందన్నారు. ఒక కిలో వాట్‌కు రూ.30 వేలు, రెండు కిలో వాట్‌కు రూ.60 వేలు, మూడు కిలో వాట్‌కు రూ.78 వేలు రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. మూడు కిలో వాట్‌కు మంచి ఎన్ని కిలో వాట్ అదనంగా పెట్టిన రూ.78 వేలు మించి రాయితీ ఇవ్వడం కుదరదని స్పష్టం చేశారు. సోలార్ రూఫ్‌టాప్ నిర్మాణం ద్వారా నెలకు 120 యూనిట్లకు రూ.338లు, 240 యూనిట్లకు రూ.333లు, 360 యూనిట్లకు రూ. 293లు బిల్లు వస్తుందని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ వినియోగించకపోతే ఆ యూనిట్లు నేరుగా పవర్ గ్రిడ్‌కు వెళ్లిపోతుందని అన్నారు. అందుకు వినియోగదారులకు విద్యుత్‌శాఖ సంస్థ నుంచి డబ్బులు చెలిస్తామని చెప్పారు. సోలార్ రూఫ్‌టాప్ వాడడం ద్వారా ఎన్నో పయోజనాలు ఉన్నాయని వివరించారు. అందుకు బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డిఇ కృష్ణమూర్తి, ఎఇ వివేకానంద, టొంప తిరుపతిరావు, లైన్‌మెన్ శివశంకర్, ప్రేమ్‌కుమార్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యోగేశ్వరరావు

పంట పొలాలు పరిశీలన

సోంపేట: మండలంలోని గొల్లూరు, ఉప్పలాం సిరిమామిడి గ్రామాల్లోని వరి పొలాలను మండల ఎఒ బి.నరసింహమూర్తి, సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ గ్రామాల పరిధిలోని వరి విస్తీర్ణం సుమారు 150 ఎకరాల వరకు ఆలస్యంగా నాట్లు వేశారన్నారు. రెండు రోజుల క్రితం ప్రారంభమై ఈ నెలాఖరు వరకు నీటి లభ్యత బట్టి జరిగే అవకాశం ఉందన్నారు. ఆలస్యంగా నాట్లు పడుతున్న ప్రాంతాలను ప్రత్యేకంగా సందర్శించి రైతులకు పలు సూచనచేశారు. ఈ నెల 8, 9 తేదీల్లో కురిసన ఓ మోస్తరు వర్షం వల్ల పొలాల్లో చేరిందని, ఎగువన ఉన్న చెరువుల్లో నీరు చేరిందన్నారు. ఆ నీటితో ఇక్కడ నాట్లు కొనసాగుతున్నాయన్నారు. అయితే నారు వయసు 70 రోజులు అయినందున ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోతే దిగుబడి ఆశాజనకంగా ఉండదని రైతులకు సూచనలు చేశారు. ముందుగా నాట్లు వేస్తున్న రైతులందరూ ఉప్పలం, గొల్లూరు మామిడిపల్లి రైతు సేవా కేంద్రాల వ్యవసాయ సహాయకుల వద్ద ఈ పంట నమోదు, ఇకెవైసి చేసుకుంటేనే పంటల బీమాకు ధాన్యం కొనుగోలుకు అర్హులవుతారని తెలిపారు. ప్రత్యేక మెలకువలు సూచిస్తూ వరి నారు సుమారు 70-80 సెంటీమీటర్లు పెరిగినందున నారు చివర్లో పది సెంటీమీటర్ల వరకు తుంచితే నాట్లు ఒరిగిపోతాయని, అలాగే చీడపీడల ఉధృతి తగ్గుతుందని తెలిపారు. ప్రస్తుతం నారుకు పిలకలు వేసే సామర్థ్యం ఏ మాత్రం లేనందున చదరపు మీటరుకు 44 మొనలు నాటుకోవాలని, మోనకు 8 నుంచి 10 మొక్కలు ఉండాలని సూచించారు. ఈ సందర్శనలో వ్యవసాయ సహాయకులు వ్యాస్, పూజ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎఒ నర్సింహమూర్తి



ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

చిన్నారికి 'మాతృమూర్తి' అండ

ప్రజాశక్తి- కవిటి

కడుపులో కణితితో బాధపడుతున్న కుసుంపురానికి చెందిన రెండేళ్ల చిన్నారి మానేక చాందినికి బల్లిపుట్టుగకు చెందిన మాతృమూర్తి యువజన సంఘం అండగా నిలిచింది. పాప వైద్య ఖర్చుల నిమిత్తం గురువారం రూ.7 వేలు అందించింది. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన చాందిని వైద్య ఖర్చులకు దాతల సాయం కోరుతోందని, దాతలు ఉదారంగా స్పందించి ఆ చిన్నారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మోహన్ దొలాయి, సురేష్, చలపతి, రమేష్, దానయ్య, కవి, కేశవ తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుల నిరసన

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్ఆర్ కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో గురువారం స్టాఫ్‌నర్సులు నిరసన చేపట్టారు. ప్రభుత్వం విడుదల చేసిన 115 జిఒను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రోగులకు ఇబ్బంది కలగకుండా షిఫ్ట్ వైజ్‌గా నిరసన చేపట్టారు.

క్విజ్ పోటీలో 'విశ్వశాంతి' ప్రతిభ

పోలాకి: మండలంలోని ఉరజాంలో గురువారం వినాయక చవితి నవరాత్రులులో భాగంగా మండలం స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో అనేక హైస్కూళ్లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో పోలాకి కేంద్రంలోని విశ్వశాంతి హైస్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. గెలుపొందిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ మెట్ట జనార్ధనరావు, ఉపాధ్యాయులు అభినందించారు.



అభినందనలు తెలుపుతున్న జనార్ధనరావు



మహిళలకు కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు సుకన్య

వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని తెలికిపెంట గ్రామ సచివాలయంలో గురువారం విశాఖపట్నం గాంధీ కేన్సర్ ఆస్పత్రి రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 181 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ నందివాడ రాజ్యలక్ష్మి, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు నందివాడ గోవిందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో తెలికిపెంట, చిన్న కాగితాపల్లి, యరగాం పంచాయతీలతో పాటు జలుమూరు మండలం కొమనాపల్లి పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు. గాంధీ ఆస్పత్రి వైద్యులు ఎం.సుధానంద, కె.సుకన్య పురుషులకు నోటి కేన్సర్ పరీక్షలు, 25 ఏళ్లపైబడిన స్త్రీలకు రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్, ఇతర కేన్సర్ వ్యాధులపై స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధానంద విలేకరులతో మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో 181 మందికి పరీక్షలు నిర్వహించగా వారిలో 9 మందికి కేన్సర్ లక్షణాలు కనిపించాయని, వారిని విశాఖపట్నం గాంధీ కేన్సర్ ఆస్పత్రిలో ఉచితంగా పూర్తిస్థాయి కేన్సర్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. శిబిరంలో టిడిపి నాయకులు కృష్ణ, అప్పారావు, గాంధీ ఆస్పత్రి సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, టిడిపి, జనసేన యువత పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. గురువారం పట్టణంలోని మీసేవా కేంద్రం వద్ద స్వయం సహాయక సంఘ సభ్యులకు యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు పొదుపు ప్రాముఖ్యతను తెలుసుకొని పొదుపు చేయాలన్నారు. ఎటిఎం పిన్, కార్డు, బ్యాంకు అకౌంటు వివరాలను అడిగితే అటువంటి వారికి వివరాలు చెప్పవద్దన్నారు. ఎటిఎం కార్డు వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. నగదు రహిత లావాదేవీలను కొనసాగించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన, సురక్ష బీమా యోజన పథకాలను వివరించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్మెన్ టోల్ ఫ్రీ నెంబర్ 14448 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ డిఎంసి కె.రాజేష్, సిఒ కె.వినోద్, ఆర్‌పి భాగ్యలక్ష్మి, సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



పోలాకి : సన్మానిస్తున్న ఎంఇఒలు

పోలాకి: మండలంలోని కోడూరు హైస్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆరవిల్లి శ్రీనివాసరావు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఎంఇఒ-2 లింగరాజు పోలాకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శ్రీనివాసరావుకు గురువారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంఇఒ-1 శ్రీనివాస్ నాయక్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొందూరు: మండలం పిల్లలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలైన భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు జి.వి.రమణారావు, వ్యాయామ ఉపాధ్యాయులు గురుగుబెల్లి రాజశేఖరరావులను గురువారం దుశ్శాలువ, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుగ్గు కాసులబాబు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పొందూరు : సన్మానిస్తున్న హెచ్‌ఎం

ఆరుతడి విధానంతో లాభాలు

ప్రజాశక్తి- రణస్థలం

ఖరీఫ్ సీజన్‌లో వరి సీడ్‌డ్రిల్‌తో సాగు చేయడం వలన ఆరు లాభాలు ఉంటాయని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. గురువారం లావేరు మండలం గురుగుబిల్లిలో జరిగిన రైతు సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెలరోజులు సమయం ఆదాతో పాటు ఎకరాకు కేవలం 12 కేజీల విత్తనం సరిపోతుందని, చీడపీడల సమస్య తక్కువని, మేలైన దిగుబడితో ఎకరాకు సుమారు 20 లక్షల లీటర్ల నీరు ఆదా చేయవచ్చునన్నారు. పంట కాల సమయంలో ఐదుసార్లు రైతులందరూ ఒకచోట కూర్చొని పంటలో ఉన్న సమస్యల కోసం మాట్లాడు కోవడంవలన శిక్షణ పొందిన అభ్యుదయ రైతు ద్వారా సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త ఆర్.కృష్ణ, అభ్యుదయ రైతు చిట్టిబాబు, రామారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు